క్లుప్తంగా

ఏటీసీని తక్షణమే రద్దు చేయాలి



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆటోడ్రైవర్లు

కర్నూలు(సెంట్రల్): ఆటో, ఇతర వాహనాల ఎఫ్‌సీలను ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ల నుంచి తీసుకోవాలన్న విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆటో యూనియన్ నగర నాయకులు దూదేకొండ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పాతబస్టాండ్‌లో ఏటీసీ సెంటర్ల ఏర్పాటును నిరసిస్తూ ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటీసీలను ప్రైవేట్‌కు అప్పగించడం ద్వారా ఆటో యాజమానులపై విపరీతమైన భారం పడుతుందన్నారు. ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. నాయకులు బి.రాధాకృష్ణ, హుసేన్‌వలి పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాలను నిలిపివేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వబోమని శాసన భలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆ సంస్థ ఓ ప్రకటనను విడుదల చేసింది. అందులో ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రబాబు పలు అంశాలపై వివరణ ఇచ్చారు. ఇటీవల తమ బృందం పి.కోటకొండ, కప్పట్రాళ్ల, నెల్లిబండ గ్రామాల్లో పర్యటించిందని, అక్కడి ప్రజలతో మాట్లాడితే వారిలో యురేనియం భయం అలాగే ఉందన్నారు. ఈ భయాన్ని తొలగించాలంటే ప్రభుత్వం యురేనియం తవ్వకాలను నిలిపివేసేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు.

జీఓ 143పై పోస్టుకార్డు ఉద్యమం

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో 143 జీఓను వెంటనే రద్దు చేయాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం చేస్తున్నట్లు ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జీఓ వల్ల ఉద్యోగుల మిగులు పేరుతో అన్ని సూపర్‌వైజర్ కేడర్లను, ఏఎన్ఎంలను రీ డిప్లాయిమెంట్ పేరుతో ఉద్యోగుల కుదింపు కారణంగా అన్ని కేడర్లు కలిపి 2వేలకు పైగా పోస్టులు రద్దవుతాయన్నారు. భవిష్యత్‌లో ఏఎన్ఎంలతో సహా అన్ని కేడర్లకు ప్రమోషన్లు ఉండవన్నారు. దీని వల్ల క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు ఆటంకం కలుగుతుందన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు పోస్టుకార్డు ఉద్యమం కొనసాగుతుందని, ప్రభుత్వం స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): తెలంగాణ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మకంగా కులగణన చేపట్టి ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం సాహసోపేతమైన ఘట్టమని, ఈ సర్వే యావత్ భారతావనికి ఆదర్శమని చెప్పారు.

నేడు పద్యపారాయణం

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్‌సిటీ పేట శ్రీరామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 6 గంటలకు పిల్లలతో శ్లోకాల పఠనం, పద్య పారాయణం నిర్వహించనున్నట్లు బ్రహ్మోత్సవ సమితి సభ్యులు తెలిపారు. మాఘ మాసం శుక్ల నవమి పురస్కరించుకొని ఊంజల సేవ ద్వారా ఉయ్యాలలో పవళింపు సేవలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే భక్తి సంగీత కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఏడీ మల్లేశ్వరమ్మను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నాలగవ తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ శాఖ నాయకులు ఏడీ వై.మల్లేశ్వరమ్మను కోరారు. ఏడీగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను బుధవారం యూనియన్ నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీశైలానికి చెందిన ఏడీ మల్లేశ్వరమ్మ కర్నూలు జీజీహెచ్‌లో 1984లో టైపిస్ట్‌గా ఉద్యోగంలో చేరి, ఇప్పుడు ఇదే ఆసుపత్రిలో ఏడీగా పదోన్నతి పొందడం అభినందించదగ్గ విషయమన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అబ్రహం, శాఖ అధ్యక్షుడు బాలునాయక్, ట్రెజరర్ సురేష్, శశిరెడ్డి, సుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ఇంతే...!

- రోగులకు వారి కుటుంబసభ్యులే స్ట్రెచర్ బాయ్‌లు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నాల్గవ తరగతి ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా స్ట్రెచర్ బాయ్‌లు లేకపోవడంతో రోగులను వారి కుటుంబసభ్యులే స్ట్రెచర్, వీల్ చైర్‌లపై ఆయా విభాగాలకు తీసుకెళ్లి వైద్యం చేయించాల్సిన పరిస్థితి దాపురించింది. ఆసుపత్రిలో 1956 నాటి పరిస్థితులకు అనుగుణంగా 114 నాల్గవ తరగతి ఉద్యోగుల పోస్టులు మంజూరయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు పోస్టులను పెంచడం గానీ, ఉన్న ఖాళీలు భర్తీ చేయడం గానీ చేయడం లేదు. ప్రస్తుతం 114లో కేవలం 58 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఉన్న 58 మందిలో సగం మంది ఇతర విధుల్లో బిజీగా ఉంటున్నారు. ఈ కారణంగా ఏ విభాగంలోనూ స్ట్రెచర్‌బాయ్, వార్డుబాయ్ కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని చోట్ల పారిశుధ్య కార్మికులే స్ట్రెచర్ బాయ్ అవతారమెత్తుతున్నారు. కొన్ని చోట్ల వారు కూడా కనిపించడం లేదు. ఈ కారణంగా రోగులను వారి కుటుంబసభ్యులే ఇతర విభాగాలకు వైద్యసేవల కోసం తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి ప్రస్తుత ఖాళీలు భర్తీ చేయడమే గాక పోస్టులు పెంచాలని రోగులు కోరుతున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)







కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కల్యాణ వైభోగం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో సూర్యనారాయణ స్వామి ఆలయం 6వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం శ్రీ ఛాయా ఉషాదేవి సమేత సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పండితులు వేద మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అంతకుముందు గణపతి, సుబ్రహ్మణ్య, దత్తాత్రేయ, గౌరీ శంకర, ఆంజనేయ స్వామి, సూర్యనారాయణ స్వామి మూల మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహా మంగళ హారతి, మంత్ర పుష్పం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను కాపాడటం అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఉప రవాణ కమిషనర్ (డీటీసీ) శాంతకుమారి

కర్నూలు(హాస్పిటల్): రహదారి ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సహాయం చేయడం మనందరి బాధ్యత అని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (డీటీసీ) ఎస్.శాంతకుమారి చెప్పారు. 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని లెక్చరర్ గ్యాలరీలో గుడ్‌సమారిటన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగినప్పుడు ఘటన స్థలంలో ఉన్న ఎవరైనా సరే అంబులెన్స్‌ను ఫోన్ చేయవచ్చన్నారు. క్షతగాత్రులను రక్షించడంలో మొదటి 60 నిమిషాలు కీలకమని,ఆలోగా ఆస్పత్రికి చేర్చేలా కృషి చేయాలన్నారు. కొత్త చట్టాల ప్రకారం సహాయం చేసిన వారిని పోలీసులు, హాస్పిటల్ సిబ్బంది ఇబ్బంది పెట్టడానికి అవకాశం లేదని చెప్పారు. రహదారి ప్రమాదాల్లో క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం రూ.5 వేల నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్ అందజేస్తారని వివరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేసుకోవాలని సూచించారు. ఆర్‌టీఓ భరత్ చౌహాన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ, సీఎస్ఆర్ఎంఓ బి.వెంకటేశ్వరరావు, డాక్టర్ భాస్కరరెడ్డి, డాక్టర్ జెషాన్ అహ్మద్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, ఎంవీఐలు కె.రవీంద్రకుమార్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతంపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): విద్యార్థులకు పాఠశాలలు అందుబాటులో ఉండేలా ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం పాఠశాలల బలోపేతంపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విద్యాశాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు ఇబ్బంది లేకుండా రీస్ట్రక్చరింగ్ చేయాలని ఎంఈఓలకు సూచించారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాలకు సంబంధించిన క్లస్టర్ల వారీగా పాఠశాలలు, విద్యార్థుల వివరాలను ఎంఈఓలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైనచోట పాఠశాలలకు అప్రోచ్ రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేసి పంపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర భరద్వాజ్, డీఈఓ శామ్యూల్‌పాల్, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, పత్తికొండ ఆర్‌డీఓ భరత్ నాయక్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీనాగ శివలీల, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర చట్టం తేవాలి



ర్యాలీ చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

కర్నూలు(సెంట్రల్): వ్యవసాయ దిగుబడులకు మద్దతు ధర కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రైతులకు సరిగా కేటాయింపులు చేయకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్లకు వరాలు కురిపించారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను రద్దు చేసి ప్రైవేట్‌కు అప్పగించేందుకు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చర్యలు తీసుకున్నారని విమర్శించారు. అయితే పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించేలా చట్టం చేసేందుకు ముందుకు రావడం లేదని వాపోయారు. నాయకులు టి.రామాంజనేయులు, సాయిబాబా పాల్గొన్నారు.

గర్భస్థ పిండానికి అరుదైన శస్త్రచికిత్స



చికిత్స పొందిన మహిళతో వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని అశ్విని హాస్పిటల్‌లో గర్భస్థ పిండానికి అరుదైన ఆపరేషన్ చేశారు. వివరాలను బుధవారం హాస్పిటల్ గైనకాలజిస్టు డాక్టర్ స్ఫూర్తి విలేకరులకు వివరించారు. కర్నూలుకు చెందిన 24 వారాల గర్భిణికి స్కానింగ్ చేయగా కవలలు ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. గర్భంలో కవలలకు మాయ (ప్లెసెంటా) ఒకటే ఉండటం వల్ల ట్విన్ ట్రాన్స్‌ఫ్యూజన్ సమస్య వచ్చిందని చెప్పారు. ఫిటోస్కోపి పద్ధతి ద్వారా లేజర్ ఉపయోగించి సమస్యను సరిచేసినట్లు వివరించారు. ఈ ఆపరేషన్‌ను తనతో పాటు పాండిచ్చేరికి చెందిన డాక్టర్ మణికందన్, ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ గాయత్రి నిర్వహించినట్లు తెలిపారు. చికిత్స తర్వాత తల్లి, గర్భస్థ పిండాలు ఆరోగ్యంగా ఉన్నారని వెల్లడించారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

కర్నూలు: నంద్యాల జిల్లా నందికొట్కూరు ఏబీఎం పాలెంలోని చౌక డిపో డీలర్ ఎం.ఉమాదేవిపై 6ఏ కేసు నమోదైంది. కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి ఆదేశాల మేరకు నందికొట్కూరు చౌక డిపోలో అధికారులు తనిఖీ చేయగా స్టాక్ రిజిస్టర్ వివరాలకు, నిల్వలకు తేడాలు బయటపడ్డాయి. 72 కేజీల బియ్యం, 877 కేజీల జొన్నలు, 143 కేజీల చక్కెర, 203 ప్యాకెట్ల కందిపప్పు ఎక్కువగా ఉన్నట్లు తనిఖీల్లో వెలుగుచూసింది. ఆ సరుకులతో పాటు ఎలక్ట్రానిక్ కాటా, ఈ–పాస్ మిషన్ తదితర వాటిని సీజ్ చేసి ఈసీ యాక్ట్ 1955 కింద 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

రేపు నెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల ఆవరణలో ఈనెల 7వ తేదీన అండర్–18 బాల బాలికల విభాగంలో నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15, 16 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించే 10వ రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సింహ వాహనంపై శ్రీహరి



సింహ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరుడు

కర్నూలు కల్చరల్: సంకల్‌బాగ్ హరి హర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ 19వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం విశేషపూజలు నిర్వహించారు. స్వామివార్లకు పంచామృతాభిషేకం, విశేష అర్చనలు, నవగ్రహ, దుర్గా, లక్ష్మీ, కుబేర హోమాలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు సింహ వాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కర్నూలు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

పిల్లల పండుగకు సర్వం సిద్ధం

కర్నూలు (సిటీ): కర్నూలులో బాలోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురు, శుక్రవారాల్లో జరగనున్న ఈ వేడుకలకు కర్నూలు నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల వేదిక కానుంది. దాదాపు 2 వేల మంది విద్యార్థులు ఈ వేడుకల్లో భాగస్వామ్యం కానున్నారు. ఈ వేడుకల్లో కర్నూలు డివిజన్ పరిధిలోని 250 పాఠశాలలు పాల్గొంటున్నాయి. మొదటి రోజు వేడుకలను కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్‌పాల్ జాతీయ పతాక ఆవిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. విద్యార్థులకు మొత్తం 35 రకాల ఈవెంట్లను నిర్వహించనున్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసే విధంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి కెంగార మోహన్ వెల్లడించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మెన్స్ హాస్టల్‌లో అల్పాహారం స్వీకరిస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన వర్సిటీలోని మెన్స్ హాస్టల్స్‌ను సందర్శించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మెన్స్ హాస్టల్ మెస్ హాల్ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎస్పీని కలిసిన కమిషనర్



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విక్రాంత్ పాటిల్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇచ్చి కమిషనర్ అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ అధ్యక్షుల నియామకం

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కర్నూలు నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు బుధవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

అధ్యక్షుడి పేరు	విభాగం
బి.బాలాంజనేయులు (బాలు)	యూత్ విభాగం
కె.మంగమ్మ	మహిళా విభాగం
కె.మోహన్ గౌడ్	రైతు విభాగం
సి.సాములు	బీసీ సెల్
కె.పరుశురాం	ఎస్సీ సెల్
పి.రవి	ఎస్టీ సెల్
ఎం.బాషా	మైనార్టీ సెల్
ఎస్.ప్రేమ్‌కుమార్	క్రిస్టియన్ మైనార్టీ సెల్
ఎస్.అన్వర్	స్టూడెంట్ విభాగం
పి.షాషావలి	మున్సిపల్ విభాగం
జి.రాజశేఖర్	ఆర్‌టీఐ విభాగం
ఎస్.టి.షేక్ అహ్మద్	వలంటీర్స్ విభాగం
సి.శేషన్న (డేవిడ్)	గ్రీవెన్స్ సెల్ విభాగం
భరత్ అభి	వాణిజ్య విభాగం
ఎం.నీలకంఠ	వీవర్స్ విభాగం
కొట్టాల ప్రకాష్	వైఎస్సార్‌టీయూసీ
వి.రాధికమ్మ	అంగన్‌వాడీ విభాగం
సి.వి.రాంప్రసాద్	లీగల్ సెల్
ఎం.కృష్ణకాంత్ శర్మ	కల్చరల్ విభాగం
జి.అశోక్ కుమార్	సోషల్‌మీడియా విభాగం
కె.నరేంద్ర బాబు	ఐటీ విభాగం
సి.పాండురంగ	దివ్యాంగుల విభాగం
డాక్టర్ డి.ఇస్మాయిల్	డాక్టర్స్ విభాగం
టి.ఆనంద్ రెడ్డి	ఇంటెలెక్చువల్స్ విభాగం
పి.చక్రపాణి రెడ్డి	బూత్ కమిటీ
ఉస్తాద్ మహబూబ్ అలీ	పబ్లిసిటీ విభాగం

రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయండి



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు (అర్బన్): జిల్లాలో చేపట్టిన పలు సర్వేలకు సంబంధించి రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి సూచించారు. ఆయన బుధవారం సాయంత్రం జిల్లా పరిషత్‌లోని తన చాంబర్‌లో కర్నూలు, పత్తికొండ డీఎల్‌డీఓలతో కలిపి ఎంపీడీఓలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిస్సింగ్ సిటిజన్స్ సర్వేకు సంబంధించి నందవరం, ఆలూరు, కృష్ణగిరి ఎంపీడీఓలు తక్కువ పురోగతి సాధించారని, ఇంకా మెరుగుపర్చుకోవాల్సిన అవసరముందన్నారు. క్యాప్చరింగ్ ఆఫ్ హౌస్ ఇమేజ్ అండ్ జియో కోఆర్డినేట్స్‌కు సంబంధించి రాష్ట్రంలో జిల్లా 12వ స్థానంలో ఉందని, దీన్ని మొదటి స్థానంలోకి తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్‌పీసీఐ యాక్షన్ టేకెన్‌లో జిల్లాలో 2,167 రికార్డులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా రెండు రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. ఇన్‌యాక్టివ్‌లో ఉన్న ఎన్‌పీసీఐ రికార్డులన్నింటినీ 15 రోజుల్లోగా యాక్టివ్‌లోకి తీసుకురావాలన్నారు. అలాగే 0–6 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లల ఆధార్ నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు.

అలగనూరు బలోపేతానికి ప్రతిపాదనలు

కర్నూలు (సిటీ): కేసీ కెనాల్ నీటిని నిల్వ చేసేందుకు ఉన్న ఏకైక రిజర్వాయర్ అలగనూరు. ఈ రిజర్వాయర్ కరకట్టలు 2015 నుంచి కుంగిపోతున్నా అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు పట్టించుకోలేదు. రిజర్వాయర్ మరమ్మతులు చేసి రివిట్మెంట్‌ను సరిచేయాలని జలవనరుల శాఖ ఇంజినీర్లు 2017లో సూచించినప్పటికీ కాలయాపన చేయడంతో రిజర్వాయర్‌పై ఆధారపడిన రైతులు, ప్రజలు సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ రిజర్వాయర్ బలోపేతం చేసేందుకు తాజాగా రూ.36.26 కోట్లకు అంచనాలు వేశారు. 2017లోనే మరమ్మతులు చేసి ఉంటే కరకట్ట దెబ్బ తినేది కాదని, చుట్టూ ఉండే మట్టి నమూనాల పరీక్షల్లో వచ్చిన ఫలితాల ప్రకారం పూర్తిస్థాయిలో బండ్‌ను తొలగించి కొత్తగా చేపట్టాలని నివేదికలు ఇచ్చారు. ఈ నివేదికల ప్రకారం మొత్తం కట్ట పునాది నుంచి పునఃనిర్మాణానికి రూ.26 కోట్లతో ప్రభుత్వానికి కేసీ ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. అయితే అప్పట్లో రిజర్వాయర్ పనులు చేయలేకపోయారు. రైతులు అలగనూరు రిజర్వాయర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని జలవనరుల శాఖ ఇంజినీర్లు తాజాగా మరోసారి అంచనాలను వేసి ప్రభుత్వానికి బుధవారం పంపారు. కర్నూలు–కడప కాలువ నీటిని తాత్కాలికంగా నిల్వ చేసేందుకు రిజర్వాయర్లు లేవు. తుంగభద్ర నదిలో నీటి లభ్యత తగ్గిపోతుండటంతో రబీ సీజన్‌లో చివరి ఆయకట్టుకు సాగునీరు, తాగునీటి కోసం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో చివరి ఆయకట్టును స్థిరీకరించేందుకు ఓ రిజర్వాయర్‌ను నిర్మించేలా 1985 సంవత్సరంలో అలగనూరు రిజర్వాయర్‌కు రూ.3.06 కోట్లకు కేవలం పరిపాలన ఆమోదం తెలుపుతూ జీఓ ఎంఎస్ నంబర్ 327 జారీ చేశారు. అయితే ఆ తర్వాత 1993 వరకు ఎవరూ పట్టించుకోలేదు. ఈ సమయంలో కేసీ కెనాల్ జైకా నిధులతో ఆధునికీకరించే పనుల్లో భాగంగా రూ.59.90 కోట్లతో రిజర్వాయర్‌ను చేపట్టారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

స్లాబ్	యూనిట్ కాస్ట్	సబ్సిడీ	బ్యాంకు లోన్
స్లాబ్–1	రూ.2 లక్షలు	రూ.75 వేలు	రూ.1.25 లక్షలు
స్లాబ్–2	రూ.3 లక్షలు	రూ.1.25 లక్షలు	రూ.1.75 లక్షలు
స్లాబ్–3	రూ.5 లక్షలు	రూ.2 లక్షలు	రూ.3 లక్షలు

కర్నూలు (టౌన్): 2024–2025 సంవత్సరానికి సంబంధించి బీసీలు, ఈబీసీలు (కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ), అలాగే కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు సంబంధించి బీసీ కార్పొరేషన్‌చే స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పథకాల ద్వారా సబ్సిడీ రుణాలకు ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 7వ తేదీలోపు https://apobmms వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. బీసీ, ఈబీసీలకు 21 – 60 సంవత్సరాలు, కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు 21 – 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, తెల్ల రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. వ్యయసాయ సంబంధ కార్యక్రమాలు, పరిశ్రమలు, చిన్న తరహా వ్యాపారాలు, సేవలు, రవాణా విభాగం వంటి సెక్టార్లలో యూనిట్లకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

బాస్కెట్‌బాల్‌లో రాణించాలి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్లు

కర్నూలు (టౌన్): బాస్కెట్‌బాల్ క్రీడాంశంలో రాణించాలని ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ మాజీ డైరెక్టర్ నాగరాజు సూచించారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అండర్–16 విభాగంలో యూత్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం సాధన చేయడం ద్వారానే క్రీడల్లో రాణిస్తారని, క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదాబాషా మాట్లాడుతూ.. ఎంపికైన జట్టు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు పిఠాపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతాప్, శ్రీను, షబ్బీర్ పాల్గొన్నారు.

రహదారులు శుభ్రంగా ఉండాలి

కర్నూలు (టౌన్): నగరంలోని రహదారులకు ఇరువైపులా పరిశుభ్రంగా ఉండాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జొహరాపురం రహదారి, చంద్రశేఖర్ నగర్, సరస్వతి నగర్ ప్రాంతాలను పరిశీలించారు. అలాగే కొండయ్య గేట్, గాంధీనగర్, ధర్మపేట కాలనీల్లో పారిశుద్ధ్య పనులు, కొండారెడ్డి బురుజు వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రహదారులు శుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మురుగు కాల్వల్లో పూడికతీత పనులు మరింత పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

యూట్యూబర్‌పై మరో కేసు నమోదు

కర్నూలు: కామన్ మ్యాన్ యూట్యూబ్ చానెల్ అధినేత పాల్లారి రమణపై మరో కేసు నమోదైంది. వాసవీ సత్రాల సముదాయాల కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ పోలీసులు బుధవారం వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పాల్లారి రమణ అయ్యప్పస్వామి గుడి సమీపంలోని బీకే సింగ్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటాడు. జిల్లా మంత్రి టీజీ భరత్, ఆయన తండ్రి, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్‌పై వార్తలు (అనుచిత వ్యాఖ్యలు) పోస్టు చేశాడన్న కారణంపై ఇటీవల మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. రమణ ప్రస్తుతం పంచలింగాల గ్రామ శివారులోని జిల్లా సబ్ జైలులో ఉన్నాడు. మాజీ కార్పొరేటర్ విఠల్ శెట్టి మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో, పాతబస్తీలోని ఎర్రబురుజులో నివాసముంటున్న టీడీపీ కార్యకర్త ఆకెపోగు శ్రీనివాసులు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయా స్టేషన్లలో కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. అయితే రమణ బెయిల్‌పై విడుదల కాక ముందే రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.P.No: 7/2025
కటిక సయ్యద్ బాషా ..అర్జీదారు
-Vs-
బి.చిట్టెమ్మ వగైరా ..రెస్పాండెంట్లు
జనరల్ నోటీసు
కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామము, ప్రకాష్‌నగర్ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నెంబర్ I.P.లో అర్జీదారు అయిన కటిక సయ్యద్ బాషా తండ్రి కటిక బాబు, గొర్రెల వ్యాపారం, ఇ.నెం. 4-30-2-5, బాలాజి నగర్, కర్నూలు అనునతడు తనను దివాలా దారుగా తీర్మానించమని దివాలా అర్జీ (I.P) దాఖలు చేసినాడు. ఇందుమైన ఎవరికైన ఆక్షేపణ ఉన్న 06.03.2025 తేదిన పగలు 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
బి.శ్రీనివాసులు
అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు
సెల్: 96521 55539